# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 05-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. నూతన నేర చట్టాలు ప్రజలకు సకాలంలో న్యాయం అందించేందుకు దోహదపడుతున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు.**

**2. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు జిల్లాల కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించనుంది.**

**3. రాష్ట్రంలో పంట నష్టపోయిన రైతులకు 80% రాయితీతో విత్తనాలను అందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

**4. దేశంలోని మూరుమూల ప్రాంతాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.**

**5. తెలంగాణ వ్యాప్తంగా ఈరోజు నుంచి ఈనెల 9వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతుంది.**

**==========================**

నూతన నేర చట్టాలు దేశ న్యాయ వ్యవస్థను పూర్తిగా స్వదేశీగా మారుస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. చండీగఢ్‌లో నేర న్యాయ వ్యవస్థకు దోహదపడేందుకు నిర్మించిన ఇ-ఎవిడెన్స్, న్యాయ్ సేతు, న్యాయ్ శృతి, ఇ-సమన్ వ్యవస్థలను అమిత్ షా నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త చట్టాలు దేశంలో వలస చట్టాల శకానికి ముగింపు పలికాయన్నారు. దేశ నేర న్యాయ వ్యవస్థ ప్రజలకు సకాలంలో న్యాయం అందించే దిశగా ముందడుగు వేస్తోందని అన్నారు. ఈ చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉన్నాయని, శిక్ష కంటే న్యాయం అందించేందుకే పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ చట్టాల ద్వారా ప్రజలకు సత్వర న్యాయం అందుతోందని కేంద్రమంత్రి పేర్కొంటూ..

..వాయిస్.. 40 సెన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వివిధ అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు జిల్లాల కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించనుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సదస్సులో మంత్రులు, ఆయా శాఖల

ప్రత్యేక, ముఖ్య కార్యదర్శులు, జిల్లాల కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు... పాల్గొంటారు. ఈరోజు ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో తొలుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తారు. శాఖల వారీ పని తీరు, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సమీక్షిస్తారు. ఒక రోజు జరిగే ఈ సదస్సులో విజన్ ఆంధ్ర 2047 దార్శనిక పత్రంపై ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు, వరదలకు పంట నష్టపోయిన రైతుల మళ్లీ పంటను సాగుచేసేందుకు విత్తనాలను 80% రాయితీతో అందిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం అగర్రు రైతు సేవా కేంద్రంలో వరి నాడుమడులు నష్టపోయిన రైతులకు రాయితీపై విత్తనాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని పాలకొల్లు మండలం అగర్రు, అగర్తిపాలెం, సగం చెరువు, వెలివెల, వరిధనం గ్రామాల్లోని రైతులకు 500 ఎకరాల్లో 150 క్వింటాళ్ళ వరి వంగడాలను 80 శాతం రాయితీతో అందజేస్తున్నామని తెలిపారు.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా ఈరోజు నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నిన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం తెలంగాణ వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలన్నారు. పచ్చదనాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో భాగం చేసుకొని మొక్కలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సామాజిక భాధ్యతగా తీసుకొని, ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సూచించారు.

---------------------------

దేశంలోని మూరుమూల ప్రాంతాల ప్రజలకు కూడా హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తాడికొండలో నూతనంగా ఏర్పాటుచేసిన బిఎస్ఎన్ఎల్ టవర్ స్టేషన్‌ను కేంద్ర మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025 నాటికి దేశంలో వంద శాతం 4జి సేవలు అందించటమే లక్ష్యంగా బిఎస్ఎన్ఎల్ ముందుకు వెళ్తోందన్నారు. లాభాపేక్ష లేకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ బీఎస్ఎన్ఎల్ ద్వారా 4జీ సేవలను అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని మంత్రి పేర్కొంటూ...

...వాయిస్..26 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మచిలీపట్నం నౌకాశ్రయం పనులను మరింత వేగవంతం చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో మంత్రి ఆధ్వర్యంలో నిన్న ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మచిలీపట్నం ప్రాంతాభివృద్ధికి ఈనెల 25న కొరియన్ బృందం పర్యటించనున్నదని, బీచ్ అభివృద్ధి, విద్యాపరమైన అంశాలపై పరిశీలన జరుపుతుందన్నారు. 8 కోట్ల రూపాయలతో

గిలకలదిండి, బందరు కోట, పోలాటితిప్ప, గరాలదిబ్బ రహదారులు, రెండు వంతెనల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు ప్రజాదర్బార్లు నిర్వహించగా 1 వెయ్యి 159 అర్జీలు అందాయన్నారు. వాటిలో 850 పరిష్కరించామన్నారు. త్వరలో మచిలీపట్నంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తామని తెలిపారు.

---------------------------

దళిత బంధు రెండో విడత నిధుల విడుదలకు ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఖమ్మంజిల్లా చింతకాని మండలంలో దళిత బంధు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రెండో విడత నిధులు తీసుకునేందుకు అర్హులైన వారి జాబితాను అధికారులు వెంటనే సిద్ధం చేయాలన్నారు. వచ్చే వారం రోజుల్లో లబ్ధిదారులకు నిధులు అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. చింతకాని మండలంతో పాటు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రెండో విడతలో దళితబంధు పొందేందుకు అర్హులైన వారి జాబితా సిద్దం చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో 1000 కొత్త బస్సులు త్వరలోనే అందుబాటులోకి వస్తాయని రవాణాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లా, కడప ఆర్టీసీ బస్టాండ్ వద్ద 18 నూతన బస్సులను మంత్రి నిన్న జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి సంబంధించి 1400 బస్సులు ప్రారంభించాల్సి ఉండగా, ప్రస్తుతం 400 కొత్త బస్సులు ప్రారంభించామన్నారు. త్వరలోనే విద్యుత్‌తో నడిచే బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కూడా చర్యలు చేపడతామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అమెరికా లో పర్యటిస్తున్నారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి, ఉద్యోగ ఉపాధి కల్పనకు దోహదపడే పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ఈ పర్యటన చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ రోజు కాగ్నిజెంట్ సంస్థ సీఈవోతో పాటు ఆర్‌సిఎం, టిబిసి, కార్నింగ్, జోయిటస్ వంటి పలు సంస్థల ప్రతినిధులతో కీలక సమావేశాలను నిర్వహిస్తారు. పెప్సీకో హెచ్సీఏ ఉన్నతాధికారులతో చర్చలు జరిపిన అనంతరం రేపు ముఖ్యమంత్రి వాషింగ్టన్ చేరుకుంటారు. 10 రోజుల పర్యటనలో భాగంగా, ముఖ్యమంత్రి డల్లాస్, శాన్ ఫ్రాన్సిస్కో మొదలైన ప్రధాన నగరాలలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆ తర్వాత దక్షిణ కొరియాలోని సియోల్‌ను ముఖ్యమంత్రి సందర్శిస్తారు.

---------------------------

శిశువుకు తల్లిపాలు ఇవ్వవలసిన ఆవశ్యకతను తెలియజేస్తూ దేశ వ్యాప్తంగా ఈ నెల ఒకటవ తేదీ నుండి జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలు ఈరోజు ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు ..., ఇతర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు వివిధ ప్రాంతాలలో తల్లిపాల శ్రేష్ఠతను తెలియజేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి. తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని,

ఈ పాలలో విటమిన్లు, ఖనిజ లవణాలు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు వుంటాయని ఆయా కార్యక్రమాలలో వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వంద శాతం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని బీజేపీ జమ్మలమడుగు శాసన సభ్యులు ఆదినారాయణ రెడ్డి తెలిపారు. విజయవాడ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు ప్రాధాన్యత కల్పించడంతోపాటు, అమరావతికి 15 వేల కోట్ల రూపాయలు కేటాయించారని చెప్పారు. రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు రాబోతున్నాయని పేర్కొన్నారు.

======================